కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ బరాజ్ వద్ద అడుగంటిన జలాలు

నీరు లేక వెలవెలబోతున్న కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ బరాజ్

కాళేశ్వరం గేట్లెత్తి ఇసుక మేత!

- ఒక్క మేడిగడ్డ వద్దే 1000 కోట్ల విలువైన ఇసుక
- అన్నారం, సుందిళ్లలోనూ అదేస్థాయిలో నిల్వలు

- ఎక్కడికక్కడ సొమ్ము చేసుకుంటున్న కాంగ్రెస్ పెద్దలు
- బరాజ్‌లను రిపేర్ చేయకుండా పాలకుల నాటకాలు
- ఎన్‌డీఎస్‌ఏ చెప్పేనే పునరుద్ధరిస్తామంటూ డ్రామాలు
- తక్షణ చర్యలకు సిఫారసు చేసినా సర్కారు బుట్టదాఖలు
- అవేగాక చెక్‌డ్యామ్‌లను కూడా నింపకుండా తవ్వకాలు
- ఆకేరు, మున్నేరు, కుడవెల్లిలో జోరుగా నడుస్తున్న దందా

హైదరాబాద్, మార్చి 23 (నమస్తే తెలంగాణ) : 'ప్రాజెక్టుల్లో నీళ్లుంటే ఏమొస్తది? అదే ఎండబెడితే ఇసుక తోడచ్చు.. కోట్లాది రూపాయలు దండుకోవచ్చు' అన్నదే నేటి కాంగ్రెస్ సర్కారు విధానమని స్పష్టమవుతున్నది. 'ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌ను ఎంత ఖర్చయినా పునరుద్ధరిస్తాం. పనులు పూర్తి చేస్తాం' అంటూ ప్రగల్భాలు పలుకుతున్న పాలక పెద్దలు, అదే మేడిగడ్డ సహా బరాజ్‌ల మరమ్మతుల ఊసెత్తకపోవడం వెనుక 'ఇసుక' మతలబు ఉన్నదని తేటతెల్లమవుతున్నది. నీటిని ఎత్తిపోయకుంటే సాగునీరివ్వలేమని అధికారులు చెప్పినా సర్కారు వినిపించుకోవడం లేదు. సాగునీరందక పంటలు ఎండుతున్నా పట్టింపు లేదు. దీని వెనుక 'అది కేసీఆర్ కట్టిన ప్రాజెక్టు కాబట్టి' అనేది ఒకెత్తయితే.. మరోకారణం వేల కోట్ల విలువైన ఇసుక నిల్వలను కొల్లకొట్టే కుతంత్రమేనని తెలుస్తున్నది. ఒక్క మేడిగడ్డ వద్దనే దాదాపు 1000 కోట్ల విలువైన ఇసుక నిల్వలు ఉన్నాయంటే.. అన్నారం, సుందిళ్ల బరాజ్‌లతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా అనేక చెక్‌డ్యామ్‌ల వద్ద ఏమేరకు నిల్వలు ఉంటాయో అర్థం చేసుకోవచ్చు. ఇప్పటికే గోదావరితో పాటు, వాగుల నుంచి ఇష్టారాజ్యంగా ఇసుక తరలిస్తున్నారు. అందుకోసమే ఎన్‌డీఎస్‌ఏ నివేదికను సాకుగా చూపి బరాజ్‌లను ప్రభుత్వం ముట్టుకోవడం లేదని అర్థమవుతున్నది. ప్రాజెక్టుల నుంచి నీళ్లను వదిలి చెక్‌డ్యామ్‌లను కూడా నింపనిదీ ఇసుక కోసమేనని క్షేత్రస్థాయి పరిసితిని గమనిస్తే తెలుస్తున్నది.

ఒక్క మేడిగడ్డ వద్దే 1000 కోట్ల ఇసుక

కాళేశ్వరం ప్రాజెక్టులో కీలకమైన మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బరాజ్‌ల వద్ద భారీగా ఇసుక మేటలు ఉన్నాయి. ప్రాజెక్టు అందుబాటులోకి వచ్చిన నాటి నుంచి మేడిగడ్డ మొదలు సుందిళ్ల వరకు, ఎగువ ఎల్లంపల్లి సైతం ఎప్పుడూ నిండుగా కళకళలాడాయి. ఈ నేపథ్యంలో ఇసుక తోడివేత దాదాపు ఐదేళ్ల పాటు అంతంతమాత్రమే కొనసాగింది. దీంతో ఎల్లంపల్లి ఎగువన, దిగువన మేడిగడ్డ వరకు భారీగా ఇసుక నిల్వలు పేరుకుపోయాయి. ఒక్క మేడిగడ్డ వద్నే దాదాపు 1.92 కోట్ల మెట్రిక్ టన్నుల ఇసుక నిల్వలు ఉన్నట్టు గతంలో టీజీఎండీసీ తేల్చింది. ఆ ఇసుక నిల్వల విలువ 1000 కోట్ల వరకు ఉంటుందని అంచనా వేసింది. ఇసుక నిల్వలను తోడివేతకు దాదాపు రెండేళ్ల సమయం పడుతుందని తేల్చింది. ఇప్పటికే మహదేవపూర్ పరిధిలో ఇసుక బ్లాక్‌లను వేలం వేసి మేటలను తొలగిస్తున్నారు. అన్నారం, సుందిళ్ల రెండు బరాజ్‌లలోనూ దాదాపు మేడిగడ్డ వద్ద ఉన్న స్థాయిలోనే ఇసుక నిల్వలు ఉన్నట్టు టీజీఎండీసీ అంచనా వేసింది. దాదాపు కాళేశ్వరంలోని 3 బరాజ్‌ల ద్వారానే ప్రభుత్వానికి దాదాపు రూ.2000 వేల కోట్లకు పైగా ఆదాయం వస్తుందని అంచనా! ఆ మేరకు సొమ్ము చేసుకునేందుకు కాంగ్రెస్ పెద్దలు సిద్ధమైనట్టు తెలుస్తున్నది.

ఎన్‌డీఎస్‌ఏ నివేదిక సాకుతో

మేడిగడ్డ బరాజ్ అన్నివిధాలుగా సురక్షితంగానే ఉన్నదని అధికారవర్గాలు వెల్లడించాయి. 7వ బ్లాక్‌లో కుంగుబాటుకు గురైన 20వ పిల్లర్ మినహా ఇతర డ్యామేజీ జరగలేదని వివరిస్తున్నాయి. ఈ ఏడాది జూలైలో లక్ష్మీబరాజ్ (మేడిగడ్డ) వద్ద 10 లక్షల క్యూసెక్కుల ప్రవాహం కొనసాగిందని, 103.55 మీటర్ల మేర ప్రవాహం నమోదైందని, ఆ తర్వాత దాదాపు నెలరోజులు సగటున రోజుకు 5 లక్షల క్యూసెక్కులు తగ్గకుండా వరద కొనసాగిందని, అయినా బరాజ్ చెక్కు చెదరలేదని వివరిస్తున్నారు. 7వ బ్లాక్‌ను పునరుద్ధరిస్తే యథావిధిగా ప్రాజెక్టులను వినియోగంలోకి తేవచ్చని ఇంజినీర్లు, నిపుణులు ఘంటాపథంగా చెప్పున్నారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం మేడిగడ్డనే కాదు, అన్నారం, సుందిళ్ల బరాజ్‌ల పునరుద్ధరణ అంశంపైనే దృష్టి సారించడం లేదు. మేడిగడ్డ ఘటన జరిగిన తర్వాత రాష్ట్రానికి వచ్చిన ఎన్‌డీఎస్‌ఏ బృందం తాత్కాలిక రక్షణ చర్యలను సిఫారసు చేసింది. తదుపరి పూర్తి స్థాయి నివేదికను డిసెంబర్ నెలాఖరులోగా అందిస్తామని గతంలో స్పష్టం చేసింది. కానీ ఇప్పటికీ నివేదికను విడుదల చేయలేదు. ఇదిలా ఉంటే ఎన్‌డీఎస్‌ఏ సిఫారసులు చేస్తేనే బరాజ్‌ల పునరుద్ధరణకు పూనుకుంటామంటూ కాంగ్రెస్ చేతులు దులుపుకొన్నది. అంతేతప్ప నివేదికను తెప్పించుకునేందుకు ఎలాంటి ప్రయత్నం చేయడం లేదు. అదీగాక ఎన్‌డీఎస్‌ఏ కోరిన సమాచారాన్ని కూడా ఇప్పటికీ పూర్తిస్థాయిలో ఇవ్వకుండా కాలయాపన చేసింది. సర్కారు వ్యవహారంతో తమకు అందిన సమాచారం మేరకే నివేదిక ఇస్తామని ఎన్‌డీఎస్‌ఏ ఇటీవల వెల్లడించింది. దీని వెనుక ప్రభుత్వ పెద్దల ఉద్దేశం వేరే ఉన్నదని రాజకీయ విశ్లేషకులు చెప్పున్నారు. కేవలం బరాజ్‌ల వద్ద గోదావరిలో పేరుకుపోయిన వేల కోట్ల ఇసుక నిల్వలను సొమ్ము చేసుకునేందుకే రిపేర్ల ఊసెత్తడం లేదని స్పష్టం చేస్తున్నారు. ఎన్డీఎస్ఏ నివేదికను సాకుగా చూపి ఇసుకను కొల్లగొట్టే ప్రయత్నాలు చేస్తున్నట్టు చెప్తున్నారు.

అనేక చెక్‌డ్యామ్‌ల్లో ఇసుక నిల్వలు

కేసీఆర్ ప్రభుత్వం వాగుల పునరుజ్జీవం పథకాన్ని ప్రతిష్టాత్మకంగా చేపట్టింది. రాష్ట్రంలోని అనేక వాగులపై వందల సంఖ్యలో చెక్‌డ్యామ్‌లు నిర్మించి జలాలను ఒడిసిపట్టింది. మానేరు, మున్నేరు, ఆకేరు, పాలేరు, స్వర్ణ, పెద్దవాగు, కూడవెల్లి, చలివాగు, నారింజవాగు, బొగ్గులవాగు తదితర వాగులపై చెక్‌డ్యామ్‌లు నిర్మించింది. వాటిలో పదుల సంఖ్యలో చెక్‌డ్యామ్‌లను మేజర్, మీడియం, మైనర్ ప్రాజెక్టులతో అనుసంధానించింది. క్రమం తప్పకుండా నీటిని వదులుతూ వాటిని ఎప్పుడూ నిండుగా ఉండేలా చూసింది. ప్రస్తుతం ఆయా చెక్‌డ్యామ్‌ల వద్ద కూడా భారీగా ఇసుక మేటలు ఏర్పడ్డాయి. వేల కోట్ల ఆదాయం సమకూరే అవకాశమున్నది. ప్రభుత్వ పెద్దలు వాటిపైనా కన్నేశారు. ఈ నేపథ్యంలోనే ఈ ఏడాది ఆయా ప్రాజెక్టుల ద్వారా, కాల్వల ద్వారా ఆయా చెక్‌డ్యామ్‌లను నింపకుండా వదిలేశారని తెలుస్తున్నది. ఫలితంగా ప్రస్తుతం మొన్నటివరకు నిండుగా కళాకళలాడిన చెక్‌డ్యామ్‌లు ప్రస్తుతం వెలవెలబోతున్నాయి. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా ఆయా వాగుల నుంచి ఇసుక తొడివేత ఇష్టారాజ్యంగా కొనసాగుతున్నది. ఇసుక నిల్వలను ఖతం పట్టించేందుకే చెక్‌డ్యామ్‌ల్లో నీళ్లు నింపకుండా వదిలేశారని స్పష్టంగా తెలిసిపోతున్నది.

అన్నారం వద్ద 2.92కోట్ల క్యూబిక్‌మీటర్ల ఇసుక

అన్నారం బరాజ్ నుంచి దాని ఎగువన సుందిళ్ల బరాజ్ వరకు 35 కిమీ దూరంలో భారీగా ఇసుకనిల్వలు ఉన్నట్లు ప్రభుత్వం గుర్తించింది. అదీగాక అన్నారం బరాజ్ ఎగువనే మానేరు నది కూడా గోదావరిలో కలుస్తుంది. కాళేశ్వరం ప్రాజెక్టులో కీలకమైన మేడిగడ్డ బరాజ్ వినియోగంలో ఉన్నంతవరకూ అన్నారం, సుందిళ్లతో పాటు ఇటు మానేరులోనూ ఎగువకు భారీగా బ్యాక్‌వాటర్ విస్తరించి ఉండేది. ఇసుక మేటలు భారీగా వేశాయి. ప్రస్తుతం బరాజ్‌లు ఖాళీ అవడంతో ఈ ఇసుకపై కాంగ్రెస్ పెద్దలు కన్నేశారు. ఈ క్రమంలోనే తాజాగా అన్నారం నుంచి సుందిళ్ల బరాజ్ వరకు, అదేవిధంగా గోదావరిలో కలిసే ప్రాంతం నుంచి ఎగువకు దాదాపు 20కిమీ వరకు మానేరులో విస్తరించిన ఇసుక నిల్వలను అంచనా వేయాలని ప్రభుత్వం ఇటీవలే ఆదేశించింది. అందులో భాగంగా సైతం అన్నారం నుంచి సుందిళ్ల వరకు లైడార్ సర్వే నిర్వహించారు. దాదాపు 35కిమీ పొడవునా 2.52 కోట్ల క్యూబిక్ మీటర్ల ఇసుక నిల్వలు ఉన్నట్లు గుర్తించారు. దీని ద్వారా ప్రభుత్వానికి దాదాపు రూ.1000-1200కోట్ల ఆదాయం సమకూరే అవకాశముందని అంచనా. ఇంకా మానేరులో ఇసుక నిల్వలపై సర్వే నిర్వహించాల్సి ఉండగా, అక్కడా భారీ నిల్వలు ఉన్నట్లు తెలుస్తున్నది.

ఇసుక దోపిడీకి గేట్లు బార్లా!

- 2.59 కోట్ల క్యూబిక్ మీటర్ల ఇసుక రీచ్‌కు సర్కారు స్కెచ్
- లైడార్ సర్వే ప్రారంభం

జయశంకర్ భూపాలపల్లి, మార్చి 23 (నమస్తే తెలంగాణ): గోదావరి, మానేరు నదుల్లో పేరుకుపోయిన ఇసుకను కొల్లగొట్టేందుకు కాంగ్రెస్ సర్కారు ప్రణాళిక రూపొందించింది. 2.59 కోట్ల క్యూబిక్ మీటర్ల ఇసుక రీచ్‌కు స్కెచ్ వేసింది. అందులో భాగంగా 11.50 కిలోమీటర్ల గోదావరి, మానేరు నది పొడవునా లైడార్ సర్వేను ప్రారంభించింది. ఇప్పటికే పలుగుల 5, పలుగుల 6, కుంట్లం, విలాసాగర్, అన్నారం, అంబట్‌పల్లి 1, 2, 3 క్వారీల ద్వారా నిత్యం 1,200 లారీల ద్వారా ఇసుక రవాణా జరుగుతున్నది. లీగల్‌గా, ఇల్లీగల్‌గా ఇసుక రవాణా యథేచ్ఛగా కొనసాగుతున్నది. కాళేశ్వరం ప్రాజెక్టు అధికారి పరిధిలో ఒక్క రోజులోనే 30 వేల మెట్రిక్ టన్నుల ఇసుక రవాణా జరుగుతున్నది. అయినా మళ్లీ కొత్త రీచ్‌ల కోసం ప్రభుత్వం సర్వే ప్రారంభించించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. బీఆర్ఎస్ ప్రభుత్వం 2023లోనే ఇసుక నిల్వలపై హైడ్రోగ్రఫీ సర్వే జరిపినప్పటికీ, భూగర్భ జలాలు అడుగంటుతాయనే కారణంగా వెనుకడుగు వేసింది. కాగా, జయశంకర్ భూపాలపల్లితోపాటు చుట్టుపక్కల జిల్లాల్లో నీళ్లు లేక పంటలు ఎండిపోతున్నా సర్కారు పట్టించుకోవడం లేదని రైతులు మండిపడుతున్నారు. కాళేశ్వరం బరాజ్‌కు మరమ్మతులు చేసి, నీరందించాల్సిందిపోయి ఇసుక దోపిడీకి తెరలేపడం దారుణమని ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు.

ఐటీకి కరెంట్ కష్టాలు

మొదటిపేజీ తరువాయి...

పనిచేస్తున్న (వర్క్ ఫ్రం హోమ్) ఉద్యోగుల పరిస్థితి మరీ అధ్వానంగా ఉందని వాపోతున్నారు. ఈ సమస్యపై ప్యూజ్ ఆఫ్ కాల్ సెంటర్‌కు ఫోన్‌చేసినా, 1912 నంబర్‌కు కాల్ చేసినా పట్టించుకునేవారే లేరని, ఒకవేళ తమ ఫిర్యాదును 'ఎక్స్'లో పోస్ట్‌చేస్తే వ్యక్తిగత వివరాలు తీసుకుని సిస్టమ్ జనరేటెడ్ మెసేజ్ సరిపెట్టడమే తప్ప సరైన స్పందనే లేదని మండిపడుతున్నారు.

నిరుటి కంటే 35% పెరిగిన డిమాండ్

హైదరాబాద్‌లోని ఐటీ కంపెనీల్లో 80% సైబర్ సిటీ సర్కిల్ పరిధిలోనే ఉన్నాయి. సైబర్‌సిటీలో 6 లక్షల విద్యుత్తు కనెక్షన్లు ఉన్నాయి. గ్రేటర్ హైదరాబాద్‌లో రోజువారీగా 75-80 మిలియన్ యూనిట్ల విద్యుత్తును వినియోగిస్తుండగా.. అందులో సగానికిపైగా డిమాండ్ సైబర్ సిటీ, మేడ్చల్, హబ్సిగూడ సర్కిళ్ల పరిధిలో ఉంటుంది. ఇది నిరుటి కంటే 35% అధికం. సైబర్ సిటీలో నిరుడు అత్యధికంగా 714 మెగావాట్ల డిమాండ్ నమోదైంది. ఈ ఏడాది ఏప్రిల్, మే నెలల్లో అది 850-900 మెగావాట్లకు పెరిగే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ నేపథ్యంలో తగట్టుగా విద్యుత్తును అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు చెప్తున్నారు. కానీ, క్షేత్రస్థాయిలో పరిస్థితి భిన్నంగా ఉంది. ఇటీవల సైబర్ సిటీ సర్కిల్‌లో కొత్తగా 232 పంపిణీ ట్రాన్స్‌ఫార్మర్లు, 25 పవర్ ట్రాన్స్‌ఫార్మర్లతో పాటు 11 కేవీ ఫీడర్లు 128, 33 కేవీ ఫీడర్లు 4 అందుబాటులోకి తెచ్చారు. ఫీడర్ల విభజనతోపాటు పీటీఆర్ సామర్థ్యాన్ని రెట్టింపు చేసినా అవి పూర్తిస్థాయిలో ఫలితం చూపలేకపోతున్నట్టు తెలుస్తోంది.

కాల్‌లో ఉండగానే కరెంట్ కట్..

మా దగ్గర కరెంట్ కోతలు విపరీతంగా ఉన్నాయి. కనీస సమాచారం కూడా ఇవ్వకుండానే రోజూ రెండుమూడు సార్లు కరెంట్ తీసేస్తున్నారు. విధి నిర్వహణలో భాగంగా క్లయింట్‌తో కాల్‌లో ఉండగానే కరెంట్ పోవడంతో ఏం చేయాలో అర్థం కావడం లేదు.

– వెంకట్, సైబర్ టవర్, హైటెక్‌సిటీ

వర్క్‌ఫ్రం హోమ్ ఉన్నా ఆఫీసుకు వెళ్తున్నాం..

మా ఏరియాలో కరెంట్ ఎప్పుడు ఉంటుందో, ఎప్పుడు పోతుందో తెలియడం లేదు. వర్క్‌లో ఉండగానే కరెంట్ తీసేస్తుండటంతో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. కరెంట్ కట్ ఎక్కువగా ఉండటంతో ఆఫీసుకు రమ్మని టీమ్‌లీడర్లు చెప్తున్నారు. దీంతో వర్క్ ఫ్రం హోం అయినా ఆఫీసుకు వెళ్తున్నాం.

– భవాని, ఐటీ ఉద్యోగిని

ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌లో పేరుకుపోయిన మట్టిని తొలగించే పనిలో రెస్క్యూ టీం

డెడ్‌బాడీలు కాదు.. ఆనవాళ్ల కోసమే..!

- మృతదేహాలు బురదలో కుళ్లిపోయి ఉంటాయని భావిస్తున్న నిపుణులు
- సొరంగం కూలిన ఏడు నిమిషాల్లోనే అందరూ మరణించినట్టు అంచనా
- ప్రమాదం జరిగి నెలరోజులు దాటినా ఇంకా దొరకని ఏడుగురి ఆచూకీ
- ఎస్ఎల్‌బీసీ ఘటన, సహాయ చర్యలపై నేడు సీఎం సమీక్షా సమావేశం

హైదరాబాద్, మార్చి 23 (నమస్తే తెలంగాణ) : నాగర్‌కర్నూల్ జిల్లా దోమలపెంట సమీపంలో ఎస్ఎల్‌బీసీ టన్నెల్ ప్రమాదం జరిగిన ఏడు నిమిషాల్లోనే అందులో చిక్కుకున్న ఎనిమిది మంది చనిపోయినట్టు అధికారులు ప్రభుత్వానికి నివేదించేందుకు సిద్ధమైనట్టు తెలిసింది. ప్రమాదం జరిగి నెల రోజులు గడిచినందున మృతదేహాలు కూడా లభించడం కష్టమేనన్న అభిప్రాయానికి వచ్చినట్టు సమాచారం. ఇకపై కూలీల అనవాళ్లు గుర్తించటానికి మాత్రమే సహాయ చర్యలు కొనసాగిస్తామని అధికారులు ముఖ్యమంత్రికి తేల్చి చెప్పేందుకు నివేదిక రూపొందించినట్టు తెలిసింది.

నేడు సీఎం రేవంత్‌రెడ్డి సమీక్ష..

ఘటనలో చిక్కుకున్న వారి కోసం ర్యాట్‌హోల్ మైనర్స్, ఎన్డీఆర్ఎఫ్, ఎస్టీఆర్ఎఫ్, సింగరేణి, ఆర్మీ సహా కేంద్ర, రాష్ట్ర ఏజెన్సీలతో సహాయ చర్యలు కొనసాగుతున్నాయి. కేరళ నుంచి వచ్చిన క్యాడవార్ డాగ్స్ సాయంతో అనుమానిత ప్రాంతాలను గుర్తించి తవ్వకాలు జరుపగా టీబీఎం(టన్నెల్ బోర్ మెషిన్) ఆపరేటర్ గురుప్రీత్ సింగ్ మృతదేహం లభించింది. మిగిలిన ఏడుగురి కోసం సహాయ చర్యలు కొనసాగుతున్నా ఎలాంటి ఫలితం లేదు. ఈ నేపథ్యంలో రెస్క్యూ పురోగతిపై సీఎం రేవంత్‌రెడ్డి సోమవారం సమీక్షా సమావేశం నిర్వహించనున్నారు. సమావేశంలో నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితోపాటు నాగర్‌కర్నూల్ కలెక్టర్, ఎస్పీ, ఎస్ఎల్‌బీసీ అధికారులు పాల్గొననున్నారు.

ఏడు నిమిషాల్లోనే అందరూ మృతి!

సొరంగం కూలిన ఏడు నిమిషాల్లోనే ఎనిమిది మంది మృతిచెందినట్టు అధికారులు అంచనాకు వచ్చినట్టు తెలిసింది. నెల రోజులుగా మృతదేహాలు బురదలో కూరుకుపోయినందున ఇప్పటికే కుళ్లిపోయి ఉంటాయని భావిస్తున్నారు. ఇదే విషయం నేడు అధికారులు సీఎం రేవంత్‌రెడ్డికి వివరించే అవకాశం ఉన్నట్టు తెలిసింది. మృతదేహాలను గుర్తించి వెలికితీయటానికి మరింత సమయం పట్టనున్నదని, ఇకపై మృతదేహాల కోసం కాకుండా, చనిపోయిన వారి ఆనవాళ్లు గుర్తించేందుకే తమ చర్యలు కొనసాగుతాయని అధికారులు ముఖ్యమంత్రికి వివరించే అవకాశం ఉన్నది.

ఇకనైనా అధికారిక ప్రకటన వచ్చేనా?

బాధిత కుటుంబాలు తమవారి కోసం నెల రోజులుగా టన్నెల్ వద్దే పడిగాపులు కాస్తున్నాయి. మరోవైపు ఈ ఘటన అరుదైనది కావడంతో దేశమంతా సొరంగం వైపే చూస్తున్నది. రాష్ట్ర ప్రభుత్వం కూడా ఇప్పటివరకు ప్రమాదంలో చిక్కుకున్న వారి ఆచూకీపై ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు. ప్రస్తుతం మృతదేహాలను కూడా ఇవ్వలేమని అధికారులు నివేదించే ఆలోచనతో ఉన్న నేపథ్యంలో ప్రభుత్వం అధికారిక ప్రకటన చేస్తుందా? లేక మృతదేహాల ఆనవాళ్లు దొరికే వరకు సస్పెన్షన్ కొనసాగిస్తుందా? వేచి చూడాల్సిందే.

బీసీ రిజర్వేషన్ అమలయ్యేనా?

మొదటిపేజీ తరువాయి...

ఉన్నట్టు కనిపించడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇంటింటి సర్వే మొదలు కమిషన్ల నియామకం, నివేదికలు, ప్రస్తుతం చట్టం రూపకల్పన తీరును చూస్తే ఇలాంటి అభిప్రాయమే కలుగుతున్నదని చెప్తున్నారు. సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు కాంగ్రెస్ ప్రభుత్వం అడుగడుగునా పాతరేసిందని, అనేక న్యాయపరమైన సవాళ్లు ఎదరవడమే కాకుండా, తుదకు చట్టమే చెల్లుబాటు కాని దుస్థితి ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.

ఆదినుంచీ ఇష్టానుసారం

బీసీ రిజర్వేషన్ల స్థిరీకరణ, ఇంటింటి సర్వేపై రేవంత్ సర్కారు ఆదినుంచీ ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నది. పేరుకు ఇంటింటి సర్వే అని చెప్పినా రాష్ట్రవ్యాప్తంగా జనాభాగణననే నిర్వహించింది. గణాంకాల సేకరణ చట్టం-2008 ప్రకారం సర్వే నిర్వహించాలంటే కొన్ని నిబంధనలను పాటించాల్సి ఉంటుంది. రిజిస్ట్రార్ ఆఫ్ ఎంక్వయిరీస్ చట్టం-1952 ప్రకారం స్వయం ప్రతిపత్తి కలిగిన కమిషన్‌ను, గణాంకాల సేకరణకు నోడల్ డిపార్ట్‌మెంట్‌ను, నోడల్ ఆఫీసర్‌ను, కమిషన్‌కు సెక్రటరీని నియమించాల్సి ఉంటుంది. నేషనల్ ప్లానింగ్ అండ్ ఇంప్లిమెంటేషన్ డిపార్ట్‌మెంట్, స్టాటిస్టిక్స్ డిపార్ట్‌మెంట్, ఎన్ఎస్ఎస్‌వో తదితర విభాగాల నుంచి రాష్ట్రానికి చెందిన తాజా ఇండ్ల జాబితాను, బ్లాక్‌ల వారీగా రూపొందించిన హౌసింగ్ మ్యాపులను కూడా తీసుకోవాల్సి ఉంటుంది. సర్వే ప్రశ్నావళి రూపకల్పనకు ప్రత్యేకంగా నిపుణుల కమిటీని ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. సేకరించిన డాటాను అందుబాటులో ఉన్న ప్రామాణికమైన ఓటర్ జాబితా, ఆధార్ జాబితా, రేషన్‌కార్డులు తదితర వాటితో విశ్లేషించాలి. ప్రజల సామాజిక, ఆర్థిక, విద్య, ఉద్యోగ, ఉపాధి, రాజకీయ అవకాశాలకు సంబంధించిన స్థితిగతులపై తులనాత్మక అధ్యాయనం చేయాలి. తుదకు అన్నింటినీ క్రోడీకరించి, విశ్లేషించి తుది నివేదికను రూపొందించాలి. దీనికి క్యాబినెట్ ఆమోదం పొందాల్సి ఉంటుంది. అప్పుడు మాత్రమే కేంద్ర ప్రభుత్వ ఆమోదంతో ఆ గణాంకాలను ప్రామాణికంగా పరిగణనలోకి తీసుకునే అవకాశముంటుందని న్యాయకోవిదులు, నిపుణులు, బీసీ మేధావులు చెప్తున్నారు. కానీ, రాష్ట్ర ప్రభుత్వం సర్వే బాధ్యతలను ప్రత్యేక కమిషన్‌కు కాకుండా, ప్లానింగ్ డిపార్ట్‌మెంట్‌కు అప్పగించింది. ఈ మేరకు జీవో-18ని విడుదల చేసిన ప్రభుత్వం అందులో స్పష్టమైన వివరాలు పేర్కొనలేదు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా సమగ్ర ఇంటింటి సర్వే (సామాజిక, విద్య, ఆర్థిక, ఉపాధి, రాజకీయ, కులాల వారీగా) అని మాత్రమే పేర్కొన్నది. ఎందుకోసం చేస్తున్నారో పేర్కొనలేదు. క్యాబినెట్, ఆపై అసెంబ్లీలో చేసిన తీర్మానాలను మాత్రమే రెఫరెన్స్‌గా ఇచ్చింది. కానీ, సమగ్ర ఇంటింటి సర్వే కోసం బీసీ సంక్షేమ శాఖ మార్చి నెలలో జారీచేసిన జీవో-26ను ఎక్కడా రెఫర్ చేయలేదు. బీసీ కమిషన్‌కు టీవోఆర్‌లను నిర్దేశిస్తూ జీవోలు విడుదల చేసింది. సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు విరుద్ధంగా, బీసీ కమిషన్‌కే బీసీ రాజకీయ రిజర్వేషన్ల స్థిరీకరణ బాధ్యతలను అప్పగించింది. ఆ తరువాత హైకోర్టు స్పష్టమైన ఆదేశాలిచ్చి, అక్షింతలు వేశాకే, నిబంధనల మేరకు డెడికేటెడ్ కమిషన్‌ను ప్రభుత్వం ఏర్పాటుచేసింది. ఇదంతా ప్రభుత్వం చిత్తశుద్ధి లేమికి నిదర్శనమని బీసీ మేధావులు ఆరోపిస్తున్నారు.

తప్పుల తడకగా సర్వే

కచ్చితమైన లెక్కలు తీయాలంటే తులనాత్మక అధ్యాయనం చేయాలి. అప్పటికే అందుబాటులో ఉన్న గణాంకాలు, కుటుంబాల సమాచారాన్ని క్షేత్రస్థాయిలో క్రాస్‌చెక్ చేసుకుంటూ, వాస్తవమేనని నిర్ధారించుకుంటూ, అదే సమయంలో కొత్త కుటుంబసభ్యుల వివరాలను నమోదు చేస్తుంటారు. సమగ్ర సమాచారాన్ని సేకరిస్తారు. అప్పుడే ఆ డాటాకు కచ్చితత్వంతోపాటు ప్రామాణికత ఉంటుంది. కానీ, రాష్ట్ర ప్రభుత్వం ఇంటింటి సర్వేను అందుకు విరుద్ధంగా నిర్వహించింది. ఎన్యూమరేటర్లకు జనాభా సమాచారాన్ని, సర్వే చేపట్టాల్సిన ఇండ్ల వివరాలను అందజేయలేదు. సర్వే పత్రాలను మాత్రమే ఇచ్చింది. ఎన్యూమరేటర్లే ఇంటింటికీ వెళ్లి ఆయా కుటుంబసభ్యులు చెప్పిన కులం, వృత్తి, ఆస్తులు, ఆదాయ వివరాలను నమోదు చేసుకున్నారు. ఆ వివరాలు సరైనవా? కాదా? అనేది క్షేత్రస్థాయిలోనే కాదు పైస్థాయిలోనూ తెలుసుకున్న దాఖలాల్లేవు. పూర్తిగా గృహ యజమానులు ఇచ్చే సమాచారం మీదనే ఆధారపడి వివరాలు సేకరించారు. ఆ తరువాత ప్రభుత్వం సర్వే నివేదికను ప్రకటించింది. రాష్ట్రంలో మొత్తం జనాభా 3.7 కోట్ల మంది కాగా, వారిలో 16 లక్షల మంది (3.1%) సర్వేలో పాల్గొనలేదని, మిగతా 3.54 కోట్ల మంది వివరాలను సేకరించినట్టు నివేదించింది. అందులో బీసీలు 46.25%, ముస్లిం బీసీలు 10.08%, ఓసీలు 15.79%, ఎస్టీలు 10.45% ఉన్నట్టు నిర్ధారించింది. కానీ పట్టణ జనాభా, గ్రామీణ జనాభా, వృద్ధులు, యువకులు, విద్యార్థులు, దివ్యాంగులు.. ఇలా క్యాటగిరీల వారీగా వివరాలను స్థూలంగానైనా ప్రకటించలేదు. జిల్లాల వారీగా కూడా గణాంకాలను వెల్లడించలేదు. కేవలం రాష్ట్రవ్యాప్తంగా ఉన్న గణాంకాలే వెల్లడించి, అసెంబ్లీలో తీర్మానం చేసింది. సర్వే గణాంకాలన్నీ అసంబద్ధంగా ఉన్నాయని, సాధికారత లేకుండా పోయిందని బీసీ మేధావులు, సామాజికవేత్తలు ఆరోపించారు. విమర్శలు రావడంతో ప్రభుత్వం రీసర్వే నిర్వహించి, మరో 21 వేల కుటుంబాల వివరాలు సేకరించింది. ఇప్పటికీ కులాలు, ఉపకులాల వారీగా జనాభా లెక్కలను ప్రకటించలేదు. కేవలం స్థూలంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసీ, మైనార్టీ వర్గాల గణాంకాలనే బయటపెట్టింది.

డెడికేటెడ్ కమిషన్ నివేదిక గోప్యం

స్థానిక సంస్థల్లో ఎస్సీ, ఎస్టీలకు మాత్రమే రాజ్యాంగపరమైన రిజర్వేషన్లు ఉన్నాయి. బీసీలకు లేవు. ఆర్టికల్స్ 243-డీ(6), 243-టీ(6) ప్రకారం మాత్రమే ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు తమ ఇష్టానుసారం బీసీ రిజర్వేషన్లు కలిస్తూ వస్తున్నాయి. దీనిని పలువురు సుప్రీంకోర్టులో సవాల్ చేశారు. ఆ పిటిషన్‌ను విచారించిన ఐదుగురు న్యాయమూర్తుల ధర్మాసనం 2010లో కీలకమైన తీర్పు ఇచ్చింది. స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్ల స్థిరీకరణకు అర్టికల్-340 ద్వారా డెడికేటెడ్ కమిషన్‌ను ఏర్పాటుచేయాలని, ఆ కమిషన్ మాత్రమే ఆయా వర్గాల రాజకీయ వెనుకబాటుతనాన్ని గ్రామస్థాయిలో, శాస్త్రీయపద్ధతిలో స్వతంత్రంగా అధ్యయనం చేయాలని, ఆపై మొత్తం రిజర్వేషన్లు 50% మించకుండా ఓబీసీలకు రిజర్వేషన్లు కల్పిస్తూ సిఫారసులు చేయాలని నిర్దేశించింది. డెడికేటెడ్ కమిషన్ సిఫారసులు లేకుండా ఎట్టిపరిస్థితుల్లోనూ బీసీలకు రిజర్వేషన్లను కల్పించవద్దని తేల్చిచెప్పింది. ట్రిపుల్‌టీ పేరిట మార్గదర్శకాలు జారీ చేసింది. కానీ ప్రభుత్వం తొలుత డెడికేటెడ్ కమిషన్‌ను ఏర్పాటు చేయకుండానే సర్వేకు సన్నాహాలు చేసింది. దీంతో పలువురు హైకోర్టును ఆశ్రయించారు. కోర్టు అక్షింతలు వేసిన అనంతరమే రాష్ట్ర ప్రభుత్వం బూసాని వెంకటేశ్వరరావు చైర్మన్‌గా డెడికేటెడ్ కమిష